www.methukuseema news
Methuku Seema

# మెతుకు సీమ

నిత్యం - ప్రజల పక్షం
తెలుగు డిజిటల్ దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి :01 | సంచిక :10 | శనివారం | 09 నవంబర్ 2024

Published from : Hyderabad,Sanagareddy
పేజీలు :06 వేల : 5.00

మెతుకు సీమ
నిత్యం - ప్రజల పక్షం
తెలుగు దిన పత్రిక
మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయట పెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలనా కథనాలకు కేరాఫ్ గా నిలిచిన ' మెతుకు సీమ '
విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలంగా దూసుకెళ్తున్న ' మెతుకు సీమ '
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు మండలాల వారిగా,
నియోజకవర్గం జిల్లాల వారీగా విలేకరులు కావలెను.
9032793832 , 8848667610

# ఎవరొస్తారో రండి..

## బుల్డోజర్‌తో తొక్కించి..

## మూసీ ప్రక్షాళన చేస్తా



- ప్రతిపక్షాలకు సీఎం సవాల్
- పునరుజ్జీవం జరిగితీరుతుంది
- లేకుంటే పేరు మార్చుకుంటా..
- సంగెం శివయ్య దగ్గర సంకల్పం తీసుకున్నా..ప్రక్షాళన చేసి తీరుతా...
- బుల్డోజర్లకు ఎవరడొచ్చినా లెక్కచేయం..తొక్కుకుంట పోవుడే..
- జనవరిలో వాడపల్లి నుంచి హైదరాబాద్కు పాదయాత్ర చేస్తా కార్నర్ మీటింగ్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- సంగెం నుంచి భీమలింగం వరకు సీఎం పాదయాత్ర

హైదరాబాద్,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : పరివాహక ప్రాంత ప్రజలు కోరుకుంటున్నట్టుగానే సంగెం భీమలింగేశ్వరుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. కాలుష్య కాసారంగా మారిన మూసీకి పునరుజ్జీవం తేవాలని జన్మదినం రోజున పాదయాత్ర చేసి సంకల్పం తీసుకున్నారు. రేవంత్ రెడ్డి గారు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. తర్వాత అక్కడి నుంచి వలిగొండ మండలం సంగెం గ్రామం చేరుకుని సంగమస్థలి మూసీ ఒడ్డున భీమలింగం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పడవలో ప్రయాణించి కలుషితాలతో ప్రవహిస్తున్న మూసీ ప్రవాహాన్ని పరిశీలించారు. మూసీ వెంట పాదయాత్ర చేస్తూ స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంగెం – నాగిరెడ్డిపల్లి రోడ్డు మార్గంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ లో ప్రసంగించారు. మూసీ కాలుష్య కాసారంగా మారిన కారణంగా తలెత్తుతున్న విష పరిణామాలను వివరించారు. జన్మదినం రోజున శివయ్యను దర్శించుకుని మూసీ పునరుజ్జీవం చేస్తామన్న సంకల్పం తీసుకోవడంతో జన్మ ధన్యమైందిగా భావిస్తానని చెప్పారు. మూసీ పునరుజ్జీవ సంకల్పంలో భాగంగా 2025 జనవరి మొదటి వారంలో మూసీ కృష్ణా నదిలో కలిసే వాడపల్లి నుంచి చార్మినార్ వరకు పాదయాత్ర చేపడుతానని ప్రకటించారు. మూసీ కాలుష్యం అణుబాంబుకన్నా ప్రమాదకరంగా మారిందని, పరీవాహక ప్రాంతాలకు వరంగా ఉండాల్సిన మూసీ శాపంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు మూసీ ప్రక్షాళనను అడ్డుకోవాలని చూస్తున్నారని, అలా చేస్తే పౌరుషాల గడ్డ నల్గొండ జిల్లా ప్రజలు తగిన సమాధానం చెబుతారని అన్నారు. అనంత పద్మనాభుడి పాదాల చెంత పుట్టిన మూసీని ప్రక్షాళన చేయడానికి దేవుడు తనకు ఒక అవకాశం ఇచ్చారని, ప్రతి ఒక్కరూ జెండాలు, ఎజెండాలు పక్కన పెట్టి ప్రజలను కాపాడాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. రేవంత్ రెడ్డి పైన నల్గొండ గద్దర్ నర్సన్న పాడిన కొత్త పాటను విడుదల చేశారు. అలాగే సంగెం గ్రామానికి చెందిన సురుకంటి రాజేందర్ మూసీ ప్రక్షాళన అంశంపై రాసిన పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

## కేసీఆర్ కాలిగోటికి కూడా రేవంత్ రెడ్డి సరిపోడు

- కనకపు సింహాసనమున' పద్యం సీఎంకు సరిగ్గా సరిపోతుందన్న హరీశ్ రావు
- రేవంత్ రెడ్డి తప్పు మీద తప్పు చేస్తున్నారని మండిపాటు
- మూసీ మురికి నీళ్లతో కడిగినా రేవంత్ నోటి మురికి పోదని వ్యాఖ్య

హైదరాబాద్,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్ కాలి గోటికి కూడా సరిపోడని... సీఎం తన స్థాయిని దిగజారి మాట్లాడుతున్నాడని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. 'కనకపు సింహాసనమున శునకము కూర్చుండబెట్టి శుభలగ్నమునం దొనరగ బట్టము కట్టిన వెనుకటి గుణమేల మాను వినురా సుమతీ!' అంటూ పద్యాన్ని కూడా రాసుకొచ్చారు. ఇది ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సరిగ్గా సరిపోతుందన్నారు. రేవంత్ రెడ్డి తప్పుమీద తప్పు చేసి వదరబోతులా ప్రవర్తిస్తున్నారని, ఆయన తీరును ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. నీ పుట్టిన రోజు నాడు... తండ్రి వయసున్న కేసీఆర్ మీద, తెలంగాణ కోసం కొట్లాడిన గొప్ప వ్యక్తి మీద, నువ్వు చేసిన నీచమైన వ్యాఖ్యలు అత్యంత హేయమని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. నీలాగా వికృతంగా మాట్లాడే ముఖ్యమంత్రిని ఈ దేశం ఎప్పుడూ చూసి ఉండదన్నారు. మూసీ నీళ్ళ మురికితో కడిగినా నీ నోరు మురికి పోదని... నీ వంకర బుద్ధి మారదని అన్నారు. నీలాగా చిల్లరగా మేం మాట్లాడలేమన్నారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని, అభివృద్ధి పథంలో నడిపిన గంభీరమైన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదే అన్నారు. కానీ బ్యాగులు మోసి, బ్యాగులు పంచి అడ్డదారిలో అధికారంలోకి వచ్చిన నీచ చరిత్ర నీదని ముఖ్యమంత్రిపై మండిపడ్డారు.



## బీసీ కులగణనపై పెదవివిరిచిన ప్రధాని మోదీ



నాసిక్,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : బీసీ కులగణనపై మోదీ మరోసారి పెదవివిరిచారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేం ద్ర మోదీ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీని యావత్ దేశం పూర్తిగా తిరస్కరిం చిందని.. అందుకు ఆ పార్టీ చర్యలే కారణ మన్నారు. ఆ పార్టీ ఇప్పుడు ఆల్ ఇండి యా కాంగ్రెస్ కాదన్న మోదీ.. పరాన్నజీవి పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. ఊత కర్రల సా యంతోనే మనుగడ సాగిస్తోందని విమర్శిం చారు శుక్రవారం నాసిక్ లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ప్రధాని ప్రసంగించారు. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బిహార్, ఝా ర?ండ్.. ఇలా ఏ రాష్ట్రంలో చూసినా కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీలపై ఆధారపడే పోటీచేసే పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలు ఉన్న చోట బీసీ కులగణనపై పెదవివిరిచిన ప్రధాని మోదీ అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నాం. పెద్ద ఆర్థికవ్యవస్థలతో ఆర్థికవృద్ధిలో అగ్రగామిగా ఉంది. ఏడాదికి 7.4 శాతం వృద్ధి రేటు నమోదు చేస్తుంది. మా సంబంధాలు ఎక్కడ, ఎంత వేగంగా అభివృద్ధి చెందుతాయనేది నేటి వాస్తవాలపై ఆధారపడి ఉంటుంది. ఆర్థిక వ్యవస్థలలో అత్యంత వేగంగా వృద్ధి చెందడంతో పాటు ప్రాచీన సంస్కృతికి నిలయమైన భారత్కు

2 లో

# బీసీ కులగణనపై పెదవివిరిచిన ప్రధాని మోదీ

ప్రపంచంలోని అగ్రరాజ్యాల జాబితాలో చేర్చడానికి అర్హత ఉంది. భద్రత, రక్షణరంగాలలో ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత అభివృద్ధి చెందుతాయి. ఏడాదికి ఇరుదేశాల మధ్య వాణిజ్యం 60 బిలియన్ డాలర్లుగా ఉంది' అని పుతిన్ పేర్కొన్నారు. ఇక, ఇరుదేశాల మధ్య ఉమ్మడి సహకారానికి బ్రహ్మోసన్ను ఉదాహరణగా పేర్కొన్నారు. ఇది భారత్– రష్యాల మధ్య విశ్వాసానికి, భవిష్యత్తులో భాగస్వామ్యానికి సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. ఉమ్మడి కరెన్సీని సృష్టించే లక్ష్యాలు లేవని వెల్లడించారు. ఈసందర్భంగా భారతదేశానికి స్వాతంత్ర్యం ఆవిర్భవించడంలో సోవియెట్ యూనియన్ పాత్రను పుతిన్ గుర్తుచేసుకున్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం ఆవిర్భవించడంలో సోవియెట్ యూనియన్ పాత్రను పుతిన్ గుర్తుచేసుకున్నారు. ఇటీవల రష్యాలోని కాజన్ వేదికగా జరిగిన 16వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్న విషయం తెలిసిందే. ఆ సమయం లో భారత ఆర్థికవృద్ధి విజయవంతంగా ముందుకెళ్తుందంటూ ప్రశంసించారు.

# తప్పు చేస్తే పెద్దపెద్దవాళ్లే జైలుకు వెళ్లారు... కేటీఆర్ ఎంత?



హైదరాబాద్,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : తప్పు చేస్తే పెద్దపెద్ద వాళ్లే జైలుకు వెళ్లారు... ఇక కేటీఆర్ ఎంత? అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ... అమెరికాలో చదువుకున్న కేటీఆర్‌కు కనీసం బుద్ధి లేదన్నారు. మద్యం పాలసీ కేసులో అరెస్టైన కవితకు బెయిల్ వస్తుందని ముందే తెలియడంతో కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు రెండు రోజులు ముందే ఢిల్లీకి వెళ్లారని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ఆరోపించారు. ఆ రెండు పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై అర్థంలేని విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.మూసీ పునరుజ్జీవ సంకల్ప యాత్ర సభలో కోమటిరెడ్డి... సీఎం రేవంత్ రెడ్డి తన పుట్టినరోజు వేడుకలను మూసీ నది పక్కన చేసుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉందని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మూసీ పునరుజ్జీవ సంకల్ప యాత్ర ముగిసిన అనంతరం నాగిరెడ్డిపల్లిలో జరిగిన బహిరంగ సభలో కోమటిరెడ్డి మాట్లాడుతూ... బీఆర్ఎస్ నాయకులు ఉద్యమం సమయం నుంచి నాటకాలు ఆడుతూనే ఉన్నారని మండిపడ్డారు. ఉద్యమం సమయంలో తనకు అగ్గిపెట్టె దొరకలేదని హరీశ్ రావు అన్నారని... ఆ రోజు మనం నమ్మి ఉండవచ్చు... కానీ ఇప్పుడు నమ్మే పరిస్థితి లేదన్నారు. మూసీ ప్రక్షాళన చేస్తామంటే డోజర్లకు అడ్డం పడతామని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారని... అలా వస్తే వారి మీది నుంచి డోజర్లను పోనిస్తామని హెచ్చరించారు. తనను జైలుకు పంపిస్తే యోగా చేసి, పాదయాత్ర చేస్తానని కేటీఆర్ చెబుతున్నారని, కానీ ఆయన మోకాళ్ల యాత్ర చేసినా ప్రజలు విశ్వసించరని వ్యాఖ్యానించారు. పదేళ్లు సమయం ఇచ్చినా మూసీని ప్రక్షాళన చేయని బతుకు ఎందుకని ధ్వజమెత్తారు.

# ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు... విచారణ వాయిదా వేసిన హైకోర్టు



హైదరాబాద్,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : బీఆర్ఎస్ నుంచి అధికార కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై ఈరోజు హైకోర్టులో విచారణ జరిగింది. బీఆర్ఎస్ తరఫున సీనియర్ న్యాయవాది మోహన్ రావు హైకోర్టులో వాదనలు వినిపించారు. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై అప్పీల్ చేసే అర్హత అసెంబ్లీ కార్యదర్శికి లేదని హైకోర్టుకు తెలిపారు. అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీల్ విచారణకు అర్హమైనది కాదన్నారు. అనర్హత పిటిషన్లపై సభాపతి సకాలంలో నిర్ణయం తీసుకోవాల్సిందే అన్నారు.ఈ సందర్భంగా పలు కోర్టుల తీర్పులను మోహన్ రావు ప్రస్తావించారు. వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి విచారణను ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసింది. కాగా, ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకోవాలని సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై అసెంబ్లీ కార్యదర్శి అప్పీల్‌కు వెళ్లారు.

# డ్రగ్స్ కేసులో ఉగాండా మహిళకు 13 ఏళ్ల జైలు శిక్ష




హైదరాబాద్,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : ఓ డ్రగ్స్ కేసులో ఉగాండా మహిళకు తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా కోర్టు 13 సంవత్సరాల శిక్ష విధించింది. పోలీసులు ఆమెను నాలుగేళ్ల క్రితం అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం ఆమెకు కోర్టు ఈ శిక్షను విధించింది. సదరు మహిళ హరారే నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకువచ్చింది. 2021 జూన్‌లో ఆమెను డీఆర్ఐ అధికారులు అరెస్ట్ చేశారు. ఆమె నుంచి డీఆర్ఐ అధికారులు 3.900 కిలోగ్రాముల హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న హెరాయిన్ విలువ దాదాపు రూ.25 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు గుర్తించారు. కోర్టు... నిందితురాలికి పదమూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1 లక్ష జరిమానా విధించింది.

# యాదాద్రి కాదు యాదగిరి గుట్ట



యాదాద్రి,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో సీఎం రేవంత్ రెడ్డి గడిపారు. తన బర్త్డే సందర్భంగా స్వామివారిని దర్శించుకుని సీఎం రేవంత్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి మూసీ పరివాహక ప్రాంతంలో ఇవాళ పాదయాత్ర నిర్వహించారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్ లో యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తో పాటు స్థానిక నేతలు సాదర స్వాగతం పలికారు. యాదగిరిగుట్ట హెలిప్యాడ్ నుంచి ప్రెసిడెన్షియల్ సూట్‌రూమ్‌కి వెళ్లిన సీఎం, విష్ణు పుష్కరిణి వద్ద నీళ్లను తలపై చల్లుకుని స్నాన సంకల్పం చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించి ఆలయానికి చేరుకున్న సీఎం రేవంత్ కు ఆలయ అధికారులు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో అఖండ దీపారాధనను ముందుగా దర్శించుకున్నారు. దీపం వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానాలయంలో సీఎం రేవంత్ రెడ్డికి ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం పలికారు. ఆయన వెంట మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, తుమ్మల, పొన్నం, కొండా సురేఖ ఉన్నారు. తర్వాత ప్రెసిడెన్షియల్ సూట్ లో యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిపై వైటీడీఏ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆ తర్వాత వలిగొండ మండలంలో మూసీ ప్రవహించే సంగెం బ్రిడ్జి వద్దకు ముఖ్యమంత్రి చేరుకున్నారు. సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డిలు దగ్గరుండి పర్యవేక్షించారు. సీఎం పర్యటన కోసం 2వేల మందితో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు.

# శివాజీ పుట్టిన గడ్డ మీది నుంచి చెబుతున్నా... ఆర్టికల్ 370ని పునరుద్ధరించే ప్రసక్తి లేదు



మహారాష్ట్ర,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కలిగించే ఆర్టికల్ 370ని పునరుద్ధరించే ప్రసక్తి లేదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తేల్చి చెప్పారు. ఆర్టికల్ 370 అంశంపై జమ్ము కశ్మీర్ అసెంబ్లీలో అధికార ఎన్సీ, ప్రతిపక్ష బీజేపీ మధ్య తోపులాట జరిగింది. ఆర్టికల్ 370ని పునరుద్ధరించాలంటూ నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం గందరగోళం మధ్యే అసెంబ్లీలో ఆమోదించింది. ఈ నేపథ్యంలో అమిత్ షా స్పందించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఉన్న అమిత్ షా మాట్లాడుతూ... నేను శివాజీ పుట్టిన మహారాష్ట్ర గడ్డమీది నుంచి చెబుతున్నాను... నాలుగు తరాలు వచ్చినా ఆర్టికల్ 370ని తిరిగి తీసుకువచ్చే ప్రసక్తి లేదన్నారు. కశ్మీర్ ఇండియాలో భాగం కాదు అనేలా ఆర్టికల్ 370 ఉందని మండిపడ్డారు. ఆర్టికల్ 370 రద్దు తమ ప్రభుత్వ ఘనవిజయం అని వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 370 రద్దు జమ్ము కశ్మీర్ అభివృద్ధికి దోహదపడిందన్నారు. అలాగే ఇతర రాష్ట్రాలతో సంబంధాలు మెరుగుపడటానికి దారి తీసిందన్నారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్ము కశ్మీర్‌లో శాంతి నెలకొందన్నారు. వేర్పాటువాద పార్టీలతో కాంగ్రెస్ పార్టీ జత కట్టడంపై ఆయన నిప్పులు చెరిగారు.

# రేవంత్ కేటీఆర్ మధ్యనే ఒప్పందం కుదిరింది



హైదరాబాద్,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : రేవంత్ రెడ్డి మిమ్మల్ని కేసీఆర్ జైలుకు పంపిన విషయం మరిచిపోయారా? అయినా రేవంత్, కేటీఆర్ మధ్య ఒప్పందం కుదిరింది... అందుకే కేటీఆర్‌ను అరెస్ట్ చేయడం లేదని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఈరోజు ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు. తాను, రేవంత్ ఒక్కటేనని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారని, కానీ తామిద్దరం ఒక్కటే అని చెప్పడానికి ఒక్క ఉదాహరణ చెప్పాలని ప్రశ్నించారు. కన్నబిడ్డ పెళ్లికి కూడా వెళ్లకుండా రేవంత్ రెడ్డిని ఇబ్బంది పెట్టారని వ్యాఖ్యానించారు. జైలుకు పంపిన విషయం రేవంత్ మరిచిపోయారేమో... అలాంటి వారితో కాంప్రమైజ్ అవుతున్నారా? అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టు కేసులపై కాంగ్రెస్ నేతలు హంగామా చేశారని, కానీ ఇప్పుడు వారి మధ్య ఒప్పందం కుదరడం వల్లే అరెస్ట్ చేయడం లేదని విమర్శించారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకుంటుంటే కేటీఆర్ యాక్టింగ్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తాను, రేవంత్ రెడ్డి ఒక్కటేనని కేటీఆర్ పదేపదే విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు తామిద్దరం గట్టిగా కొట్లాడామని... అందుకే కేటీఆర్‌కు మేం కలలోకి వస్తున్నామని వ్యాఖ్యానించారు. డైవర్షన్, కాంప్రమైజ్ పాలిటిక్స్ చేసే అలవాటు కేటీఆర్‌కే ఉందన్నారు. తెలంగాణలో బీజేపీకి చోటు లేకుండా చేయాలని బీఆర్ఎస్, కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నాయని... కానీ ప్రజలు తమ వెంట ఉన్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి బీఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులే దొరకడం లేదని విమర్శించారు. ప్రధానిని కూడా కేటీఆర్ ఏకవచనంతో విమర్శిస్తున్నారని మండిపడ్డారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. జన్వాడ ఫాంహౌస్ కేసులో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటయ్యాయని ఆరోపించారు. మూసీ నది పక్కన ఇళ్లు కూల్చేసిన చోట రేవంత్ రెడ్డి పాదయాత్ర చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఇళ్లు కూల్చి... నల్గొండలో పాదయాత్ర చేయడం ఏమిటని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఆరు గ్యారెంటీలపై పాదయాత్ర చేయాలని సూచించారు. ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు కాకుండా ఎన్నికలు వచ్చినప్పుడు బయటకు వస్తే లీడర్ ఎలా అవుతారని బండి సంజయ్ ప్రశ్నించారు.

# వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్



గుమ్మడిదల,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : గుమ్మడిదల మండల పరిధిలోని వడ్ల కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ రైతులు తీసుకువచ్చిన సన్నరకం వడ్లను ఏ గ్రేట్ బి గ్రేడ్ ఎలా గుర్తించాలో సంబంధిత అధికారులతో పాటు హమాలీలకు సూచించారు. రైతులు వడ్లు తీసుకువచ్చేటప్పుడే నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ తాలు లేకుండా శుభ్రపరచుకొని తీసుకువస్తే వెంటనే తూకం వేసుకుంటారని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో డి శ్రీనివాస్ రావు, ఏఈఓ లు నికిత, ప్రణవి, మౌనిక రైతులు తదితరులున్నారు.

# ఘనంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు






శివంపేట్,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : మెదక్ జిల్లా శివంపేట్ మండలంలోని పిల్లుట్ల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారి జన్మదినం సందర్భంగా మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు ప్రముఖ సంఘ సేవకులు బండారి గంగాధర్ ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ పిల్లుట్ల హైస్కూల్, ప్రైమరీ స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు అరటి పండ్లు బిస్కెట్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు రాఘవ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండారి కిష్టయ్య, ఎక్స్ ఎంపిటిసి మంగళపర్తి నాగయ్య, పిల్లి వెంకటయ్య, మంగళపర్తి బిక్షపతి, మంగళపర్తి గోనయ్య, మంగళపర్తి నాగయ్య, మంగళపర్తి కిష్టయ్య గుర్రాల సాయిలు, బబ్బురి మాణిక్యం, బాబ్బరి రాములు, గుర్రాల మల్లేశం. గుర్రాల శివయ్య, సంద్ర లక్ష్మయ్య, సంద్ర సత్యనారాయణ, పిల్లి అంజయ్య, మంగళపర్తి అంజయ్య, అందే నర్సింలు, బి జి ఆర్ యువసేన అధ్యక్షుడు కుమ్మరి నాగరాజు, బండారి సాయి కిరణ్, గాండ్ల దాసు, బబ్బురి శ్రావణ్, బబ్బురి శివ, బండారి క్రాంతి, పిల్లి మణికంఠ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పాదయాత్రగా వెళ్లిన స్వాములకు భిక్ష ఏర్పాటు

- సాహితి రాము గురు స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు
- అలాగే స్వాములకు మెడిసిన్ అందించిన సాహితి రాము గురుస్వామి




సదాశివపేట,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : సదాశివపేట నుండి శబరిమలై వరకు పాదయాత్రగా వెళ్తున్న నాయుడు గురు స్వామి బృందాన్ని మార్గమధ్యలో కోడూరు దగ్గర సాహితీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ రాము గురుస్వామి ఆధ్వర్యంలో మహా పాదయాత్రగా వెళ్లిన స్వాములకు బిక్ష ఏర్పాటు చేశారు. అలాగే స్వాములకు కావాల్సిన మందులను టాబ్లెట్లను ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సాహితీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ రాము గురుస్వామి మాట్లాడుతూ శబరిమలై కి పాదయాత్ర అనేది చాలా శ్రమతో కూడుకున్న కార్యక్రమం అయినా కూడా స్వామివారి అనుగ్రహం ఉంటే అసాధ్యమైన కూడా సుసాధ్యంగా జరుగుతుందన్నారు. తన ఆధ్వర్యంలో కూడా శబరిమలైకి పాదయాత్రగా రెండుసార్లు వెళ్లడం జరిగిందన్నారు. పాదయాత్రలో అయ్యప్ప స్వామి ఎన్నో పరీక్షలు పెడుతూ కూడా తన సన్నిధానానికి భక్తులను చేరవేరుస్తారన్నారు. పాదయాత్ర చేయడం ద్వారా అదో గొప్ప అనుభూతి మనసు ప్రశాంతత కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్ గురు స్వామి, పరమేశ్వర్ గురుస్వామి, వెంకటస్వామి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే చింత ప్రభాకర్ , బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు



సంగారెడ్డి,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఒక ప్రకటనలో ప్రభుతాని డిమాండ్ చేశారు. జిల్లాలో ధాన్యంతో పాటు ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, గత ప్రభుత్వం సీజన్ ప్రారంభానికి ముందే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వెంట వెంటనే రైతుల ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విషయంలో ఆలస్యం చేయడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో మొత్తం 16 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఏ ఒక్క కొనుగోలు కేంద్రంలోనూ వేగవంతంగా ధాన్యం కొనుగోలు జరగడం లేదు అధికారులు దృష్టి పెట్టాలి. సరైన ఏర్పాట్లు లేక ధాన్యం తడుస్తోంది. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పిన అది అమలు కాకా రైతులు నష్టపోతున్నారు. మరో రెండు రోజుల్లో వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. జిల్లాలో ధాన్యం తడవకుండా ఏర్పాట్లు చేయాలి. ఆరుగాలం పండించిన పంటను కాపాడుకోవడం ఒక ఎత్తయితే, చేతికొచ్చిన పంటను అమ్ముకోవడం తలకు మించిన భారంగా మారిందని అన్నారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని ప్రభుతాన్ని డిమాండ్ చేశారు.

# పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి దామోదర్ రాజనర్సింహా




రాయికోడ్,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలోని నాగ్వార్ గ్రామంలో ఎస్.బి.ఎఫ్ కాటన్ కార్పొరేషన్ నందు పత్తి కొనుగోలు కేంద్రాన్ని వైద్య ఆరోగ్య శాఖ మాత్యులు మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 3 లక్షల 40 వేల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతోంది.ఈ సంవత్సరం పత్తి దిగుబడి బాగా రావడం, సకాలంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. పత్తి రైతులకు మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం విస్తృతమైన చర్యలు తీసుకుంటోంది. ఈ కేంద్రం ద్వారా పత్తి రైతులకు తమ పంటకు కేంద్ర ప్రభుత్వం అందించే సురక్షితమైన ధర అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోబడినట్లు మంత్రి తెలిపారు. రైతులు తమ పత్తిని మంచి ధరకు విక్రయించుకోవాలని సూచించారు. రైతులు తమ పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ముందు పత్తిని బాగా ఆరబెట్టుకోవాలని సూచించారు. ఆరబెట్టడం ద్వారా పత్తి తూకం కచ్చితంగా ఉండి మంచి ధర అందే అవకాశం ఉంటుంది. తేమ శాతం 8 నుండి 12 లోపు వుండే విధంగా చూసుకోవాలమని రైతులకు మంత్రి సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం పత్తి రకాలకు అనుగుణంగా మేలు రకం పత్తి: రూ. 7521, మధ్య రకం పత్తి: రూ. 7471, మూడోవ రకం పత్తి: రూ. 7121 ధరలు ఉన్నాయని తెలిపారు. ఈ ధరలు మార్కెట్‌లో రైతులకు మంచి ఆదాయాన్ని అందించే అవకాశం కల్పిస్తాయని ప్రభుత్వం భావిస్తోందన్నారు. రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకురావడం ద్వార సురక్షితమైన ధరలను పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ పత్తి కొనుగోలు కేంద్రం నందు రైతులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలనీ అధికారులను ఆదేశించారు. సిసిఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా), వ్యవసాయ, మార్కెట్, రవాణా శాఖ అధికారులందరూ సహకరించేందుకు సిద్ధంగా ఉంటారని మంత్రి స్పష్టం చేశారు. రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలనీ అధికారులను ఆదేశించారు. ఈ పత్తి కొనుగోలు కేంద్రం ను రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలం ప్రత్యేక అధికారి జగదీష్, ఆర్.డి.ఓ రామిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఏ.డి.ఏ సత్యనారాయణ, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గోదావరి గంగా ఆగ్రో చెక్కర పరిశ్రమను ప్రారంభించిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహా




రాయికోడ్,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల పరిధిలోని మాటూర్ గ్రామ శివారులో శుక్రవారం నాడు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గోదావరి గంగ ఆగ్రో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (చక్కర ఫ్యాక్టరీని) ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ 10 నెలల వ్యవధిలోనే ఈ ఫ్యాక్టరీని నిర్మించిన యాజమాన్యాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో చెరుకు రైతులకు మేలు జరిగేలా ఎన్సీఈఆర్టీ నిబంధనలను అమలు చేస్తున్నామన్నారు. చెరుకు రైతులు ఆందోళన చెందవద్దన్నారు. గత పదేళ్లలో జిల్లాలో ఏ ఒక్క షుగర్ ఫ్యాక్టరీని నిర్మించలేదన్నారు. రాష్ట్రంలో 12 షుగర్ ఫ్యాక్టరీలు ఉంటే అందులో 6 మాత్రమే పనిచేస్తున్నాయన్నారు. షుగర్ ఫ్యాక్టరీ లను దేశవ్యాప్తంగా నెలకొల్పి ఎంతో విజయవంతంగా నిర్వహిస్తున్న గోయల్ – బండారి కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. చక్కెర ఫ్యాక్టరీ నీ ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామన్నారు. రూ. 250 కోట్లతో నిర్మించిన ఈ చక్కెర ఫ్యాక్టరీలో ప్రత్యక్షంగా 300 మందికి ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. ఇథనాల్ పరిశ్రమ తో పాటు పవర్ ప్లాంట్ నిర్మిస్తున్నారన్నారు. కొత్తగా ఏర్పాటుచేసిన ఈ పరిశ్రమ లో 4 లక్షల టన్నుల చెరుకు ప్రెస్సింగ్ చేసే సామర్థ్యం ఉందన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధిలోకి వస్తుందని ఆశాభవాన్ని వ్యక్తం చేశారు. ఆందోల్ నియోజకవర్గం సుభిక్షంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. చెరుకు రైతులకు పూర్వ వైభవం సంతరించుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రాయికోడ్, నారాయణఖేడ్, రేగోడు, మునిపల్లి, అల్లాదుర్గ్, జహీరాబాద్, శంకరంపేట ప్రాంతాల చెరుకు రైతులకు శుభపరిణామం ఉన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కర్, మధ్యప్రదేశ్ శాసనసభ్యులు మో%శీ%ట్ సోలంకి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ అధ్యక్షులు గొల్ల అంజయ్య, సంస్థ యాజమాన్యం గోయల్ – బండారి కుటుంబ సభ్యులు, రాయికోడ్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి,వైస్ చైర్మన్ వినయ్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలాజీ నరసింహులు, జిల్లాకు చెందిన ఏయంసి మార్కెట్ చైర్మన్లు కమిటీ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, చెరుకు రైతులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ డీ.ఎస్ చౌహన్
- రామాయంపేట లో కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ



రామాయంపేట,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ డీ.ఎస్ చౌహన్ అధికారులను ఆదేశించారు. రామాయంపేట పట్టణంలోని మార్కెట్ కమిటీని తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ డి.ఎస్ చౌహన్ తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆయన సూచించారు. సెంటర్ నిర్వాహకులు సరిగ్గా పని చేయడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా తనిఖీల్లో భాగంగా రామాయంపేట మార్కెట్ కమిటీని తనిఖీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రాష్ట్ర సివిల్ సప్లైకమిషనర్ తో పాటు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ , అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు హరికృష్ణ, సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా సీఎం జన్మదిన వేడుకలు

- భారీ చిత్రపటం గీసిన మైనంపల్లి అభిమానులు
- పారిశుధ్య కార్మికులకు, ఆశా వర్కర్లకు బట్టల పంపిణీ
- వేలాది మందికి అన్నదానం
- సీఎంకు ఫోటో బహుకరించిన జిల్లా ఇంచార్జీ మంత్రి కొండా సురేఖ






మెదక్,నవంబర్ 08 ( మెతుకు సీమ న్యూస్) : సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం మెదక్ జిల్లా వ్యాప్తంగా అత్యంత వైభవంగా జరిగాయి. మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్, రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ లు సంయుక్తంగా మెదక్ పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో సీఎం పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతా రావులు హాజరై అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ లను కట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని భారీ స్థాయిలో గీసారు. ఈ సందర్భంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు, ఆశా వర్కర్లకు బట్టల పంపిణీ చేశారు. బర్త్ డే వేడుకలకు హాజరైన వేలాది మందికి అన్నదానంచేశారు. అంతకు ముందు హైదరాబాద్ లో మైనం పల్లి సీఎం రేవంత్ రెడ్డిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు జిల్లా ఇంచార్జీ మంత్రి కొండా సురేఖ సీఎం రేవంత్ రెడ్డి కి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లతో దిగిన సెల్ఫీ ఫోటోను అందజేశారు. భారీ స్థాయిలో సీఎం బర్త్ డే వేడుకలు జరుగడంతో మెదక్ లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే లు మాట్లాడుతూ సీఎం ఆశీస్సులతో మెదక్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి, డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మున్సిపల్ చైర్మన్ తోడుపునూరి చంద్రపాల్, తెలంగాణ రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వీరేశం, అరుణార్తి వెంకట రమణ, రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఆవుల రాజిరెడ్డి, సుప్రభాత్ రావు రాంచందర్ గౌడ్, ఆవుల గోపాల్ రెడ్డి, హరికృష్ణ, రాగి అశోక్, హాఫిజ్, ఆంజనేయులు గౌడ్, బొజ్జ పవన్, ఉప్పల రాజేష్, ఎంఎస్ఎస్ఓ ప్రతినిధులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

# ఇంటింటి సర్వే సమర్ధవంతంగా అమలు చేయాలి

**-జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



మెదక్,నవంబర్ 08 ( మెతుకు సీమ న్యూస్) : బలహీనవర్గాల అభ్యున్నతికై సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి,రాజకీయ సర్వే జిల్లాలో సమర్ధవంతంగా అమలవుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శుక్రవారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా మెదక్ మున్సిపాలిటీ ఒకటో వార్డులో గృహాల జాబితా నమోదు మూడో రోజులో భాగంగా కలెక్టర్ని వాసగృహాన్ని సర్వే చేయడానికి వచ్చిన ఎనిమినేటర్లకు కలెక్టర్ పూర్తి సమాచారం అందించి సహకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా మూడో రోజు గృహాల జాబితా నమోదు చేస్తున్నామని ఏ ఒక్క ఇంటిని వదిలిపెట్టకుండా జాబితా సిద్ధం చేస్తున్నామన్నారు. రేపటినుండి పూర్తి సమాచారంతో సమగ్ర సర్వే కొనసాగుతుందని ప్రజలందరూ సహకరించాలన్నారు. నిన్నటి వరకు గృహాల జాబితా నమోదులో భాగంగా 1613 బ్లాకులలో 1613 ఎన్యుమరేటర్ లను,167 సూపర్వైజర్లను నియమించుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో గ్రామీణ ప్రాంతాలలో 1,23,326 ఇండ్ల జాబితా నమోదు చేయగా పట్టణ ప్రాంతంలో-19754 , జిల్లా వ్యాప్తంగా-1,43080 ఇండ్ల జాబితా నమోదు పూర్తి చేసినట్లు చెప్పారు. గృహాల జాబితా చివరి రోజు మా ఇంటిని సర్వే నిర్వహించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. గృహాల జాబితా నమోదుకు వచ్చిన ఎన్యుమరేటర్లకు సమగ్ర సమాచారం ఇచ్చి సహకరించామని తెలిపారు. అనంతరం మా ఇంటికి స్టిక్కర్ వేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ గృహాల జాబితా సమాచారాన్ని అందించి సమగ్ర కుటుంబ సర్వే కు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ కమిషనర్, జి శ్రీనివాస్ రెడ్డి, ఎన్యుమరేటర్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# దంత వారోత్సవాలు




సంగారెడ్డి బ్యూరో,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : దంత వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పరిధిలోని ఎమ్ ఎన్ ఆర్ కళాశాల దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం ఐబి నుండి సంగారెడ్డి పాత బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. దంత వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో డాక్టర్ రూప రాణి, డాక్టర్ సత్య ,ఎంఎన్ఆర్ కళాశాల పిఆర్ఓ దుర్గాప్రసాద్, డాక్టర్ ఎస్ఎస్ వాణి, డాక్టర్ పార్ల వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మిల్లర్లకు అపోహలు - అనుమానాలు వద్దు

- పారదర్శకంగా ధాన్యం కేటాయిస్తాం
- పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి డి.ఎస్. చౌహాన్




మెదక్,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : మిల్లర్లకు వారి గత సి.ఏం.ఆర్. పనితీరును బట్టి పారదర్శకంగా ధాన్యం కేటాయించడం జరుగుతుందని మిల్లర్లు ఎలాంటి అపోహలు, అనుమానాలు పెట్టుకోకూడదని పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి డి.ఎస్. చౌహాన్ అన్నారు.శుక్రవారం రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి డి.ఎస్. చౌహాన్ మెదక్ జిల్లా రైస్ మిల్లర్స్ తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతీ గ్రామంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయడం జరుగుతున్నదని తెలిపారు. రైతుల వద్దకే ప్రభుత్వ యంత్రాంగం వస్తున్నాదని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ఉద్దేశం అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పండించే బియ్యం కు మంచి పేరుందని, ఆ బియ్యం రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో పండించిన బియ్యం తిరిగి నిత్యావసర సరకుల పంపిణీ ద్వారా రాష్ట్రంలోని నిరుపేద ప్రజలకు పంపిణీ జరుగుతున్నదని తెలిపారు. రాష్ట్రంలో ఉత్పత్తితో పాటు క్వాలిటీ ను కూడా పెంచడం జరిగిందని తెలిపారు. మిల్లర్ల సహకారంతో ధాన్యం సేకరైంచడం మిల్లింగ్ చేయడం జరుగుతున్నదని తెలిపారు. రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాలను తీసుకువచ్చి కాంట అయిన మూడు, నాలుగు రోజుల్లోనే చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. నాణ్యమైన ధాన్యం ప్రతీ బస్తాలో 40.650 కిలోలుగా తూకం వేయడం జరుగుతుందని చెప్పారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలను తీసుకురావాలని, అదేవిధంగా ధాన్యాన్ని శుభ్రపరచి తేవాలని అన్నారు. పంట పూర్తిగా పండి కోతకు ఆస్కారం ఉన్నపుడే కోయాలని తెలిపారు. పచ్చిగా ఉన్నపుడు కోయడం మంచిది కాదని అన్నారు. ఆరబెట్టి తీసుకవచ్చిన ధాన్యాన్ని మంచి మద్దతు ధర కల్పించడం జరుగుతుందని, ఎలాంటి కోతలు చేయబడవని తెలిపారు. పచ్చిపంట కోయడం నేరమని ఆయన అభిప్రాయపడ్డారు. అధికారులు నీతి నిజాయితీగా పనిచేయడం ద్వారా మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గ్రహించాలి తెలిపారు. రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో 490 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, సన్నరకం వడ్లు కొనుగోలుకు అవసరమైన చోట ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 6,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే తెలుపుటకు టోల్ ఫ్రీ ఏర్పాటుచేయడం జరిగిందని, టోల్ ఫ్రీ లో వచ్చిన సమస్యలకు ఎప్పటికప్పుడు సమాధానాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ చంద్రపాల్, రా రైస్ ప్రెసిడెంట్ వీరేశం, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైస్ మిల్లర్స్, డి ఆర్ డి ఏ పి డి శ్రీనివాసరావు, ఎల్ డి ఎం, తాసిల్దార్ రజని, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

**- విద్యార్థులకు పండ్లు పంపిణి**





పాపన్నపేట,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : తెలంగాణ మంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం పాపన్నపేట మండలంలో ఘనంగా జరిగాయి. మండలంలోని అన్నారం గ్రామంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు సల్మాన్ రాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ నడిఒడ్డున కేక్ కట్ చేసి ప్రజలకు విద్యార్థులకు కేక్, పండ్లు పంపిణి చేశారు.ఈ సందర్భంగా సాల్మన్ రాజ్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన 10నెలల వ్యవదిలోనే యువతకు వేలాది ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామన్నారు. ఇంటింటి సర్వేతో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు పోచ ప్రసాద్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఇస్మాయిల్ యూత్ కాంగ్రెస్ సెక్రటరీ రవికుమార్, పాషా చందర్, నర్సింలు, హిరలాల్, లక్ష్మణ్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# అక్రమంగా ఎండు గంజాయి సరఫర



మెదక్,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : జి శ్రీనివాస్ రెడ్డి అసిస్టెంట్ కమిషనర్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ మెదక్ డివిజన్ సంగారెడ్డి తెలిపిన పత్రికా ప్రకటనలో తేదీ బుధవారం రోజున అక్రమంగా ఎండు గంజాయి చేపడుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు శ్రీ కె శ్రీనివాసరావు అసిస్టెంట్ సూపరిండెంట్ ఎన్ఫోర్స్మెంట్ మెదక్ డివిజన్ ఆధ్వర్యంలో పాస్తాపూర్ X రోడ్ జహీరాబాద్ దగ్గర గల ఉత్తమ్ ఎనక్లేవ్ వెంచర్ వాహన తనిఖీలు చేపట్టడం జరిగింది. ఈ తనిఖీలలో అనుమానాస్పద వ్యక్తి దగ్గర తన ద్విచక్ర వాహనం బైక్ నంబర్ AP 23 AF 2722 పై ఎండు గంజాయితో పాటు పట్టుబడ్డాడు. ద్విచక్ర వాహనం ను తనిఖీ చేయగా 1.345 కేజీల ఎండు గంజాయి లభ్యమైనట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపినారు. అనంతరం సదరు పట్టుబడిన వ్యక్తి వివరాలు షేఖ్ రహెమాత్ అహ్మద్ మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన వాడని ప్రస్తుతం జహీరాబాద్ పట్టణంలో నివసిస్తూ బీదర్లో గంజాయి కొని ఇక్కడ అధిక ధరకు అమ్ముతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రైడ్లో అధికారులు గాంధీ నాయక్ సిఐ, యాదయ్య యస్ఐ, హెడ్ కానిస్టేబుల్ అలీమ్ , కానిస్టేబుల్ మల్కయ్య, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ రాయికోడ్ మండలంలో సుడిగాలి పర్యటన








రాయికోడ్,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా రాయికోడు చౌరస్తాలోని నాగ్వర్ లో సిసిఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మాటూర్ గ్రామంలో 250 కోట్ల రూపాయలతో నిర్మించిన గోదావరి గంగా ఆగ్రో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (చక్కెర ఫ్యాక్టరీ) ని ప్రారంభించారు. అనంతరం, మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ & కాలేజీలను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ను బలోపేతం చేస్తున్నమన్నారు. అందుకు అవసరమైన అంతర్గత సిసి రోడ్లను, డ్రింకింగ్ వాటర్ సదుపాయాన్ని, ఆర్ ఓ ప్లాంటు, ఇన్ఫ్రాస్ట్రక్చర్ను , పాఠశాల గ్రౌండ్ను, డిజిటల్ క్లాస్ రూమ్లను సిఎస్ఆర్ ఫండ్స్ తో అభివృద్ధి చేస్తామన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ అండ్ కాలేజ్ లను పరిశీలించారు. మోడల్ స్కూల్ అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని సంబంధ శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. వీటితోపాటు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను, సోషల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఉన్న సంక్షేమ హాస్టల్ ను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను వెంటనే కల్పించేలా ప్రతిపాదనలను రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ వెల్ఫేర్ హాస్టల్లో విద్యార్థులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు వేడుకల సందర్భంగా కేక్ ను కట్ చేసి విద్యార్థులకు తినిపించారు. విద్యార్థులతో కలిసి తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షులు అంజయ్య, మండల అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కేతరి నాథ్, కుసునూరి సతీష్ కుమార్, ఆర్డిఓ రామ్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ డెవలప్మెంట్ ఆఫీసర్ జగదీష్, తాహసిల్దార్ యు శ్రీనివాస్, ఎంపీడీవో మసూద్ షరీఫ్, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వంశీకృష్ణ, ఎం ఈ ఓ అంజయ్య, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

---

## 11వ పిఆర్సి ప్రకారం కనీస వేతనం 26000 ఇవ్వాలి

**- పెరిగిన వేతనం కార్మికులకు అమలు చేయాలి**

సంగారెడ్డి బ్యూరో,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : మున్సిపల్ కార్మికులకు 11వ పిఆర్సి ప్రకారం కనీస వేతనాలు అమలు, పెరిగిన వేతనం కార్మికులందరికీ అమలు చేయాలని అలాగే కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలని కార్మికులకు వేతనాలు పెంచకపోతే విధులు బహిష్కరిస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం యాదగిరి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు ఈరోజు సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం మున్సిపల్ కమిషనర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం యాదగిరి మాట్లాడుతూ మున్సిపల్ లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులందరికీ పర్మనెంట్ చేయాలని ఆలోపు 11వ పిఆర్సి ప్రకారం వేతనాలు కనీస వేతనాలు అమలు చేయాలని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు ప్రజల ఆరోగ్యం పట్ల నిరంతరం శ్రమిస్తున్నా మున్సిపల్ సిబ్బంది అడుగడుగునా విపక్షతకు గురౌతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించబోయే కనీస వేతనం రూ.26,000/-లుగా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. జీఓఆర్టి నెం.60, 63 లలో నిర్ణయించిన విధంగా కేటగిరీల వారీ వేతనాలను అమలు చేయాలన్నారు. జీఓఆర్టి నెం. 1037లో ప్రతిపాదించిన మున్సిపాల్టీలలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సేవలను థర్డ్ పార్టీకి అప్పజెప్పాలనే నిర్ణయాలను ఉపసంహరించుకోవాలి. ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆయన అన్నారు ఆంధ్రప్రదేశ్లో మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్నట్లుగానే తెలంగాణాలో కూడా రూ.21,000/-ల వేతనం చెల్లించాలి, కొత్తగా నియమించుకున్న కార్మికులకు పాత కార్మికులతో సమానంగా వేతనాలు చెల్లించాలన్నారు. ప్రమాదాల్లో మరణిస్తున్న కార్మికులకు రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలని, దహన సంస్కారాలకు రూ.30,000/-లు ఇవ్వాలన్నారు. వయస్సు మీరిన, అనారోగ్యానికి గురైన కార్మికునికి రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలి. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సువర్ణ, సంగమేశ్, సుగుణమ్మ, నర్సింలు, లక్ష్మీనారాయణ, యాదయ్య, నరసమ్మ, సంగీత శశికళ, వేణు, యాదగిరి, రాజు,సంగమేశ్వర్ లక్ష్మీనారాయణ నరసింహులు యాదయ్య రాజేశ్వర్ నాగరాజు నర్సింలు తదితరులు పాల్గొన్నారు



## కానిస్టేబుల్ కొట్టాడని యువకుడు ఆత్మహత్య



సంగారెడ్డి బ్యూరో,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : కానిస్టేబుల్ కొట్టాడని మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా అల్లాదుర్గం మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం రాంపూర్ గ్రామానికి చెందిన తలారి కిషన్ (36)అనే యువకుడు తన సెల్ఫోన్ పోయిందని పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేయడానికి బుధవారం రాత్రి వెళ్లినట్లు వారి బంధువులు తెలిపారు. డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ సాయిలు ఫిర్యాదు తీసుకోవడానికి నిరాకరించడమే కాక కొట్టాడని మనస్తాపంతో తన గ్రామానికి వెళ్లిన కిషన్ ఎస్సీ కమ్యూనిటీ హాల్ సమీపంలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో హుటాహుటిన కిషన్ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కాగా తన చావుకు కానిస్టేబుల్ కారణమని సూసైడ్ నోట్ రాసినట్లు స్థానికులు తెలిపారు. దీంతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, బంధువులు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. యువకుడి మృతికి కారణమైన కానిస్టేబుల్ సాయిలు వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ఎస్సై ప్రవీణ్రెడ్డి వారిని శాంతింపజేసి మెదక్ డిఎస్పీతో మాట్లాడించారు. న్యాయం చేస్తామని డిఎస్పీ హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.

---

## మహిళా సాధికారత - మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యానికి ప్రభుత్వ సహకారం

**- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**



సంగారెడ్డి బ్యూరో,నవంబర్ 09 ( మెతుకు సీమ న్యూస్) : శుక్రవారం సంగారెడ్డి పట్టణంలోని విద్యానగర్ లో ఈవెంట్ మేనేజ్మెంట్ వ్యాపార కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ప్రారంభించారు. పట్టా పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో శాంతి స్లమ్ సమాఖ్య పరిధిలోని మూడు స్వయం సహాయక సంఘాల నుండి ఎంపికైన ఏడుగురు మహిళలు కలిసి ఈ కార్యాలయాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ, పేదరిక నిర్మూలనలో మహిళల పాత్ర ముఖ్యమైనదని, వారి సామర్థ్యాలను పెంపొందించి సొంత వ్యాపారాల్లో నిలదొక్కుకోవడం ద్వారా వారు ఆర్థికంగా ఎదగవచ్చని అన్నారు. మహిళలు సమాఖ్యలో చేరి వ్యాపారాలు ప్రారంభించడం సాహసోపేతమైన విషయం అని అన్నారు. సమష్టిగా పనిచేస్తూ మంచి నాణ్యతతో కూడిన సేవలు అందించడం ద్వారా ఈవెంట్ మేనేజ్మెంట్ రంగంలో సుస్థిర స్థానం ఏర్పరచుకోవచ్చు అని సూచించారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులైన మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యానికి ప్రభుత్వ సహకారం ఎప్పుడు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు చంద్రశేఖర్, మెప్మా పి.డి, శ్రీమతి గీత, తహసీల్దార్ దేవదాస్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహన్, మెప్మా డి.ఎం.సి,లు టి.ఎం.సి లు, మహిళా సమాఖ్య సంఘం మహిళలు పాల్గొన్నారు.

**విలేకరులు కావలెను**

మెతుకు సీమ దిన పత్రికలో పని చేయుటకు మండలాల వారిగా విలేకరులు కావలెను

సంగారెడ్డి జిల్లాలో : ఐడిఏ బొల్లారం, పటాన్చెరువు రామచంద్రాపురం, అమీన్పూర్, జోగిపేట, వట్పల్లి, కోహిర్, జహీరాబాద్ ఝరాసంగం, న్యాల్కల్, మానూర్, నారాయణఖేడ్, కంగ్టి, నాగలి గిద్ద, కాలిహేర్.

ఆసక్తి గా ఉన్న పురుషులు ఫోన్ చేయాల్సిన మా ఫోన్ నంబర్స్

9032793832
8848667610

www.methukusima.news Methuku Sima
మెతుకు సీమ
నిత్యం - ప్రజల పక్షం తెలుగు దిన పత్రిక

1

**విలేకరులు కావలెను**

మెతుకు సీమ దిన పత్రికలో పని చేయుటకు మండలాల వారిగా విలేకరులు కావలెను

మెదక్ జిల్లాలో : మెదక్, హవేలీ ఘనపూర్, నిజాంపేట్, పాపన్నపేట్, చిన్న శంకరంపేట, శివం పేట్, కొల్చారం, తూప్రాన్, మనోహరాబాద్, వెల్దుర్తి, పెద్ద శంకరంపేట, చేగుంట, రేగోడు, అల్లాదుర్గం .

ఆసక్తి గా ఉన్న పురుషులు ఫోన్ చేయాల్సిన మా ఫోన్ నంబర్స్

9032793832
8848667610

www.methukusima.news Methuku Sima
మెతుకు సీమ
నిత్యం - ప్రజల పక్షం తెలుగు దిన పత్రిక

2

Printed,Published and owned by baindla Srinivas,Madava nagar,Sangareddy-502001,Telangana State,
Phone No. 9032793832 Mail id:methukuseemanews@gmail.com